# విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

శనివారం 25 జనవరి, 2025. 4 పేజీలు


# మహిళలు, బాలికల భద్రతే పోలీసు లక్ష్యం

## మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ రామారావు

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** సమాజంలోని మహిళలు బాలికల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి కే.సిహెచ్.రామారావు అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు కస్తూరిదేవి ప్రభుత్వ బాలికల హై స్కూల్ మైదానంలో బొల్లినేని, రామచంద్రారెడ్డి, మురళీకృష్ణ నర్సింగ్ కాలేజీల విద్యార్థినీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో డిఎస్పీ ప్రసంగిస్తూ సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, మహిళలు, బాల బాలికల సంరక్షణ చర్యలు, ఫోక్సో యాక్ట్, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైమ్ లపై నర్సింగ్ కాలేజీ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినిలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్సిఐ కృష్ణారెడ్డి, సిబ్బంది వై శ్రీహరి, డి.సతీష్, కె.ప్రసాద్, టీవీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### 26న జరిగే రైతు ర్యాలీని

## విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో:** సిటీ రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరను చేస్తూ చట్టం చేయాలని రైతు సంఘాల డిమాండ్ సాధనకై, ఈనెల 26వ తేదీన జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని, రైతు సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్దతు ధర కై 2021 డిసెంబర్ 9న కేంద్రం వ్రాతపూర్వక హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ పార్లమెంట్లో చట్టం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీని అమలు చేయాలని గత నాలుగేళ్లుగా జనవరి 26న దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 26న కూడా అన్ని జిల్లా కేంద్రాలలో రైతుర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక సంఘాలు ఈ ర్యాలీని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు నగరంలో బోసు బొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు జరిగే ర్యాలీలో రైతాంగం విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు: జెసి

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** ఈనెల 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. 2047 విజన్ ఆంధ్ర ప్రణాళిక అమలు లక్ష్యాలకు అనుగుణంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పది స్టాళ్లు, పది శకటాలను ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు. మీడియా, విఐపి గ్యాలరీ ఏర్పాట్లు, సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, టాయిలెట్లు, శానిటేషన్ ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. విద్యుత్,

2

### బాలికలకు బంగారు భవిష్యత్ అందించడం

## ప్రతిఒక్కరి బాధ్యత :డిఎంహెచ్‌వో

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :** బాలికలకు బంగారు భవిష్యత్ అందించడం సమాజంలో ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుజాత అన్నారు. శుక్రవారం ఉదయం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిదేవి హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొన్న విద్యార్థినులు బాలికా విద్య ఆవశ్యకత, బాల్యవివాహాల నిర్మూలన, సృష్టికి ఆధారం బాలికలు, ఆడపిల్ల ఇంటికి భారం కాదు ఇంటికి వెలుగు, బాలికా విద్య దేశాభివృద్ధికి మూలం వంటి నినాదాలతో బాలికల గొప్పదనాన్ని అందరికీ తెలిసేలా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత మాట్లాడుతూ

2లో

# ఇటు పచ్చటి పంటల పరదా- అటు దళారులు బెడద!..

### మధ్యలో ఎరువులు పురుగుమందుల దుకాణదారులు అధిక ధరల మోత -యూరియాపై 50రూపాయలు,డిఏపి బస్తాలపై అదనంగా 20 రూ.బాదుడు

### కుదేలవుతున్న అన్నదాతలు -చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు

**విశాలాంధ్ర- కావలి రూరల్:** ఈ చిత్రం చూస్తే పచ్చదనంతో నిండిన పచ్చటి పంట పొలాలు మాత్రమే కనిపిస్తుంది .. కానీ ఆ పచ్చటి పరదా వెనుక దాగి ఉన్న అన్నదాతల కన్నీటి రోధనలు మాత్రం కనిపించవు..ఆరుగాలం చెమట చుక్కలు చిందిస్తే గాని పంట చేతికి అందని పరిస్థితి అన్నదాతల్లో అలుముకుంది. ఒకపక్క దుక్కి దున్ని.. విత్తు నాటి.. ఏరువాక సాగించి సస్యరక్షణ చర్యలు చేపట్టిన పంట చేతికొచ్చే సరికి రైతు రైతన్నల కష్టం బూడిద పాలు అవుతుంది. దళారులు ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు తీసుకుంటున్న అధిక ధరల బెడదతో అన్నదాతలు కుదేలవుతున్నారు.. కంచే చేను మేస్తే అన్న చందంగా రైతుల పరిస్థితి అలుముకుంది.వ్యవసాయ సీజన్లో రైతులను ఎరువుల దుకాణదారులు, పురుగుమందులు దుకాణదారులు నిలువున దోచేస్తున్నారు. అందిన కాడకి రైతును బట్టి ఒక్కోచోట ఒకొక్క రకంగా ఇష్టానుసారంగా నిబంధనకు విరుద్ధంగా రైతులను నిలువునా దోపిడికి గురి చేస్తున్నారు. దుకాణదారులు అన్నదాతల అవసరాలను ఆసరా చేసుకుని అందిన కాడికి హెూల్ సేల్ ఎరువులు దుకాణదారులు యూరియా పై 50 రూపాయలు, డి ఎ పి పై 20 రూపాయలు ఒక్కో బస్తాపై అదనంగా భారం మోపుతున్నారు. ఫలితంగా బస్తాపై రైతు అదనంగా చెల్లిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతులకు విక్రయించే ఎరువులపై కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుంది . రాయితీ పోగ కంపెనీలు ఎంఆర్ పి ని నిర్ణయిస్తాయి. నిర్ణిత ధరకే విక్రయించాల్సి ఉంటుంది. కావలిలో కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఎలాంటి తనిఖీలు చేయకుండా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎరువులు ధరలు పెరగడం జరిగిందని సమాచారం. పంటలు వెన్ను దశకు రావటంతో ఎరువులు వాడకం ఇక ఉండదు.కానీ ఇక్కడినుంచే పురుగుమందులను రైతులు పిచికారి ఈ పురుగు మందుల్లో బయోల మందులు విచ్చల విడిగా దుకాణదారులు రైతులకు అంటకట్టి నిలువు దోపిడి చేస్తున్నారు. వాస్తవానికి బయో మందులను గ్రోత్ సంబందించిన వాటికి మాత్రమే వాడాలి.కానీ దుకాణదారులు మాత్రం చీడ పీడలకు సైతం రైతులకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారు. సేద్యపు పనుల సాగుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు మరింత విస్తృతంగా సేవలు అందించాలని మంత్రి సూచించారు. భూసార పరీక్షలు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని మంత్రి పేర్కొ న్నారు. పంటల బీమా, యాంత్రీకరణ, కౌలు రైతులకు చేయాల్సిన సాయం ఇతర పథకాలపై మంత్రికి ఉన్నతాధికారులు వివరిం చారు. అవేవీ ఇక్కడ కనిపించడం లేదని ప్రభుత్వ ఆశయానికి వ్యవసాయ శాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారని రైతులు వాపోతున్నారు.

### ఎరువులు , పురుగు మందులు దుకాణాలపై తనిఖీలు ఎక్కడ?

ఎరువులు, పురుగు మందులు దుకా ణాల్లో అన్నదాతల దగ్గర అందనంగా దోచుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు దుకాణాల్లో తనిఖీలు మొక్కుబడిగా చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడంలో అలసత్వం వహిస్తున్నట్లు విమర్శలు లేకపోలేదు.క్షేత్రాయ స్థాయిలో పరిశీలించి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులే ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు అని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

### రైతుల అప్పులే దుకాణదారులకు ఆసరా

సాధారణంగా రైతులు ఏటా వ్యాపారులు నుంచి ఎరువులను ఎక్కువగా అప్పుగా తీసుకుంటారు. పంట చేతికొచ్చిన తర్వాత తిరిగి చెల్లిస్తుంటారు. పురుగు మందులు ,డిఏపి ,కాంప్లెక్స్ ఎరువులు పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. చిన్న సన్నకారు రైతులు వ్యాపారుల వద్ద ఖాతా తెరిచి అవసరమైనప్పుడల్లా ఎరువులను, పురుగు మందులను అప్పుగా తీసుకుంటారు . దీన్నే ఆసరాగా తీసుకోని రైతు నుంచి అదనంగాపురుగు మందుల,ఎరువుల దుకాణాల దారులు అందిన కాడికి గుంజుకుంటున్నారని అరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని దుకాణాల్లో బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు దోపిడీ గురికాకుండా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై కావలి వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేయగా ఏలాంటి సమాచారం దొరకలేదు. ఫోన్లు నాట్ కర్వేజ్ అని తెలపటం విశేషం.

## ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో స్వచ్ఛతా పక్షాహం

**విశాలాంధ్ర -కావలి:** ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కావలి జనతాపేట శాఖ, కావలి శాఖలు సంయుక్తంగా కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ లోని ఏ.పీ.టీ డబ్ల్యూ ఆర్ ఈ గురుకులం పాఠశాలలో స్వచ్ఛతా పక్షాహం 2025 కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యాలయం సీనియర్ మేనేజర్ కె. అజయ్ సింహ రెడ్డి,సరళ రుణ కేంద్రం, కావలి విభాగం సీనియర్ మేనేజర్ జి. చంద్రశేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ, పిల్లలు పాఠశాల నుంచే స్వచ్ఛత, పరిశుభ్రత అలవాటు చేసుకోవాలని పాఠశాల సిబ్బందిని కోరారు. ఉద్యోగులకు అతి తక్కువ వడ్డీకే గృహ, వాహన రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం బ్యాంకులో రిటైల్ ఫెస్టివల్ లోన్స్ క్యాంపెయిన్ ద్వారా నెలాఖరు వరకు గృహ, వాహన, సాలరీ, మార్టిగేజ్ లోన్లకు ప్రాసెసింగ్ ఛార్జీలు, మార్టిగేజ్ ఛార్జీలు మినహాయించబడ్డాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కావలి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పమ్మలోనన్ సేతి, కావలి జనతాపేట బ్రాంచ్ మేనేజర్ కె. శ్రీకాంత్ , సరళ రుణ కేంద్రం కావలి విభాగం అసిస్టెంట్ మేనేజర్ కె.రాజశేఖర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

**విశాలాంధ్ర-గుడ్లూరు:** పైరుకు అమర్చిన విద్యుత్ తీగలు గేదె కి తగలడంతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన గుడ్లూరులో చోటు చేసుకుంది. గుడ్లూరు మిట్టపాలెంకు చెందిన బత్తల కోటిలింగం అనే రైతుకు సంబంధించిన సుమారు 80 వేల రూపాయలు విలువ కలిగిన సూడి గేద మిట్ట పాలెం సమీపంలో ఉన్న రైతు ఇనకల్లు లక్ష్మీనారాయణ పొలంలో చనిపోయింది. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన చేశారు. పైరుకు విద్యుత్ వైర్లు బిగించినట్లు కనీసం ఎవరికీ చెప్పకపోవడం ఈ ప్రమాదం జరిగిందని ఇదే తరహాలో మనుషులు ఆ వైపుగా వెళ్లిన ప్రమాదం తప్పేది కాదన్నారు.

## పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధికి చికిత్సలు

**విశాలాంధ్ర-మనుబోలు:** రాష్ట్ర ప్రభుత్వం పశువర్ధన్ పశుసంవర్ధక శాఖ ప్రతిష్టాత్మకంగా ముందు స్థూపం రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుందని పశు వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఈ శిబిరాలను రైతుల ఉపయోగించుకోవాలని పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల సరఫరాతో గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్నామని అన్నారు. పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారం మనుబోలు మండలం కొమ్మలపూడిలో నిర్వహించడం జరిగిందన్నారు. శిబిరంలో భాగంగా మొత్తం 301 పశువులు, జీవాలకు పరీక్షలు, చికిత్స అందించడం జరిగింది. గేదెలు, ఆవులకు చూడి పరీక్షలు నిర్వహించి పునరుత్పత్తి సమస్యలున్న 54 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయడం జరిగింది. 101దూడలకు, 54 పెద్ద పశువులకు, సన్న జీవాలకు నట్టల నివారణ మందులు (డీ వార్మింగ్) త్రాగించడం జరిగింది. గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది.రైతులు పశు సంరక్షణంలో సరైన పౌష్టికాహారం ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పశుఉత్పాదకతను పెంచుకోవాలని పశువైద్య అధికారి డా. మహమ్మద్ షరీఫ్ తెలిపారు.కార్యక్రమంలో స్థానిక రైతులు ఆదినారాయణ రెడ్డి, జయపాల్ రెడ్డి, వెంకారెడ్డి, పాడి రైతులు, పశువైద్య సిబ్బంది ఇమామ్ భాషా, కల్యాణి, కామాక్షమ్మ, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది.

## ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాలు

**విశాలాంధ్ర-రాపూరు:** రాపూరు మండలంలో జాతీయ బాలికల దినోత్స వ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వేపినాపి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో, గోవునుపల్లి లోని ఉన్నత పాఠశాలలో, రాపూరు పాఠ శాలలో శుక్రవారం జరిగిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకలలో రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సునంద పర్యవేక్షణలో జరిగిందని వెపినాపి సేక్టర్ అంగన్వాడి సూపర్ వైజర్ సౌజన్య, గోనుపల్లి సేక్టర్ అంగ న్వాడీ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మీ, రాపూరు సేక్టార్ అంగన్వాడి సూపర్ వైజర్ తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతు అన్ని రంగాల్లో బాలికలు ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ సిడిపిఓ సునంద తెలియజేసారు. కిశోర బాలికలకు విద్య, ఆత్మరక్షణ, పోషకాహారం, టోల్ ఫ్రీ నంబర్‌లపై, వ్యక్తిగత పరిశు భ్రతపై, సమాజంలో కిషోర్ బాలికలు ఏ విధంగా ఉండాలి అనే విషయాలపై సమగ్రంగా వారికి వివరించడం జరిగింది. అనంతరం జాతీయ కిశోర బాలిక దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్య కర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కేర్ ఆఫ్‌అడ్రస్ కోవూరు

**విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు :** కోవూరు టిడిపి నేతలు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఒకే అంటే మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి సైతం పచ్చ కండువా కప్పుకునేందుకు రెడీగా వున్నారన్నారు టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి. ఏ మాట్లాడాలో తెలియని కన్ఫ్యూజన్‌లో కోవూరు నియోజకవర్గాన్ని ఉద్దేశించి అవినీతి రహిత అనబోయి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అనేశారన్నారు. మంత్రిగా వున్నప్పుడు నియోజకవర్గంలో అడుగు పెట్టనీయని ప్రసన్న తరుపున మాజీ మంత్రి కాకాణి వకాల్తా పుచ్చుకోవడం విడ్డూరంగా వుందన్నారు. దాదాపు 8 వేల మందికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు 100 మందికి పైగా దివ్యాన్గులకు ఉచితంగా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు యిచ్చిన ప్రశాంతి రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం టిడిపి నాయకులు బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రసన్న పాలనలో అవినీతిలో టాప్ రేటింగ్లో వున్న కోవూరు నియోజకవర్గం వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక అవినీతి రహితంగా మారిం దన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న చెబుతున్న మాటలు వింటుంటే తన హయాంలో జరిగిన అవినీతి గురించి తానే చెబుతున్నట్టు వుందన్నారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక కోవూరు నియోజకవర్గంలో ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. రెండు సార్లు జాబ్ మేళా నిర్వహించి దాదాపు 3 వేల మందికి ఉపాధి కల్పిస్తూ ప్రజాసేవకు మారుపేరుగా వున్న ప్రశాంతి రెడ్డి పాలనలో కోవూరు ప్రశాంతంగా ఉందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కరకట్ట మల్లికార్జున గారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి కూడా భయపడే పరిస్థితిని ఆయన గుర్తు చేశారు. మూడేళ్ళ క్రితం ఎంపిటిసి ఎన్నికలలో ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అరాచకాలు ప్రజలు మరిచిపోలేదన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే ప్రజలు చెప్పులతో తరిమి తరిమి కొడతారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని అధికారులను దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. కోవూరు టిడిపి అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ 16 నెలలు జైల్లో గడిపిన దొంగ నాయకత్వంలోని నాయకులందురు దొంగలేనన్నారు. మాజీ మంత్రి కాకాణిని ఉద్దేశించి కోర్టులో ఫైళ్ల దొంగన్నారు. వైసిపి పాలనలో గ్రావెల్ దొంగలు, గంజాయి దొంగలు ఏకంగా అసాంఘిక శక్తులు రాజ్యమేలాయన్నారు. నిజాయతి పరులైన అధికారులు, నాయకుల పై నోరు పారేసుకుంటే భారీ మూల్యం చెల్లించు కోవాల్సివస్తుందని హెచ్చరించారు. కారుకూతలు కూస్తే ప్రజలు చెప్పులతో కొడతాం న్నారు. చివరిగా టిడిపి నాయకులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గాన్ని అవినీతిరహిత, క్యాన్సర్ రహితంగా మారుస్తూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గారి ప్రజాహిత కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రసన్న కుమార్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు.

## గోశాల ప్రారంభం

**విశాలాంధ్ర -మర్రిపాడు:** మండల పరిధిలోని పడమటి నాయుడు పల్లి లో అదే గ్రామానికి చెందిన చిలపం మల్లేష్ వారి కుటుంబ సభ్యులతో కలిసి గోశాలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల కన్వీనర్ అరికట్ల జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్బంగా అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల నుండి ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనగా వచ్చిన అతిధులకు చిలపం మల్లేష్ అన్నదానం సదుపాయం ఏర్పాటు చేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామానికి చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు జనార్దన్, అద్దంకి రామకృష్ణ, జనసేన నాయకులు పవన్,తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర-వలేటివారిపాలెం:** మండలంలోని కొండారెడ్డి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కాకుపాలెంలో పశు ఆరోగ్య శిబిరం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీధర్ రావు హాజరయ్యారు. వైద్య శిబిరాలు రైతులుఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పులి వంశీ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

**విశాలాంధ్ర-ఉదయగిరి:** రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసులు హెల్మెట్ ధరించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు అవగాహన శుక్రవారం కల్పించారు ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూజిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు కావలి డి.ఎస్.పి శ్రీధర్ సూచనలతో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి శీను పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## బోగోలులో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం

**విశాలాంధ్ర-బిట్రగుంట:** బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వనాథరావుపేటలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల, చెన్నారాయునిపాలెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోశుక్రవారం కావలి ఐసిడిఎస్ ప్రాజెక్టుఅధికారి సౌజన్య ఆధ్వర్యంలో"జాతీయబాలికదినోత్సవం"కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలికలకు విద్య, పౌష్టికాహారం, ఆరోగ్యం, వ్యక్తి గత పరిశుభ్రత, బాల్య వివాహాలు, లింగ వివక్షత, బాలికల అక్రమరవాణా, భేటీబచావో భేటీ పడావో వంటి అంశాలపై కిశోరీబాలికలకుఅవగాహనకల్పించారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు: జెసి

**(మొదటి పేజి తరువాయి)** అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని శాఖల విభాగాధిపతులు సమన్వయంతో పనిచేసి వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లను అధికారులు జాయింట్ కలెక్టర్ కు వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాల ప్రదర్శన, పోలీసుల గౌరవ వందనం వంటి అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ఏ ఎస్ పి జి మునిరాజా, డి.ఎస్.పి చంద్రమోహన్, డిఆర్ఓ ఉదయభాస్కరరావు, ఆర్డీవో అనూష, డ్వామా, డిఆర్డిఏ ప్రాజెక్ట్ అధికారులు గంగాభవాని, నాగరాజకుమారి, డిఎం అండ్ హెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఈవో ప్రసన్నలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రతిఒక్కరి బాధ్యత :డిఎంహెచ్‌వో

**(మొదటి పేజి తరువాయి)** బాలికలు అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించేందుకు లింగవివక్ష లేకుండా అన్ని అవకాశాలను సమానంగా కల్పించాలన్నారు. స్త్రీలను గౌరవించడం ఒక డిమాండ్ కాదని, వారి ప్రేమ, ప్రేరణ, పాలన, లాలన మన మేథో, నైతికశక్తుల రెట్టింపు కోసమే అవసరమనే విషయాన్ని లోతుగా ఆలోచన చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం ఆధిక్యత అనే ఆలోచనను దరికి రానీయకూడదన్నారు. అప్పుడు అద్భుతమైన నవ సమాజానికి నాంది పలకవచ్చన్నారు. మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పి రామారావు మాట్లాడుతూ బాలికలకు మనం ఇచ్చే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలే వారికిచ్చే నిజమైన గౌరవాలుగా చెప్పారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన పెంచడమే జాతీయ బాలికా దినోత్సం ప్రధాన లక్ష్యంగా చెప్పారు. బాలికలకు రక్షణకు ఉన్న చట్టాల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జువైనల్ యాక్ట్, బాల్యవివాహాల నిషేధ చట్టం, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం వంటి అనేక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయని, వీటి అమలుకు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్ని చట్టాలున్నా బాలిక రక్షణ, హక్కులు, ఆర్థిక పరిపుష్టికి సమాజమే ప్రధాన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికలను అందరూ గౌరవించి వారి అభ్యున్నతికి కృషిచేయాలన్నారు.తొలుత అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఇన్‌చార్జి పిడి అనూరాధ, జిల్లా కార్మికశాఖ అధికారి వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటసుబ్బయ్య, ఎంఇవో జానకిరాం, బాలల సంరక్షణ అధికారి సురేష్, సమత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, అంగన్వాడి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో కల్లుగీత కార్మికులకు 18 మద్యం షాపులు

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :** ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లు గీత కార్మికుల సంక్షేమార్ధం జిల్లాలోవారికి ప్రత్యేకంగా 18 మద్యం షాపులు కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లాకు మంజూరైన18 షాపులకు కల్లు గీత కార్మికుల్లోని ఉప కులాలకు షాపులను లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఈ లాటరీ లో గమళ్ల కులానికి 4,గౌండ్ల కులానికి1, గౌడ కులానికి 7, గౌడ్ కులానికి 6 కేటాయించారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ సమితి నాయకుల పరిశీలనలో పూర్తి పారదర్శకంగా లాటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల సంక్షేమంకొరకు ప్రభుత్వం వారికోసమే జిల్లాలో ప్రత్యేకంగా మద్యం షాపులు కేటాయించారన్నారు. ఆయా కులాలలోని ఉప కులాలకు లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించడం జరిగిందన్నారు. ఉప కులాలకు కేటాయించిన షాపుల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల ఏర్పాటు కొరకు ఆయా ఉపకులాలలోని ఔత్సాహికుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా షాపుల లైసెన్స్ ఫీజులో వారికి 50 శాతం రాయితీ కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారివెంకట లక్ష్మమ్మ, బిసి కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**విశాలాంధ్ర-గుడ్లూరు:** మండలంలోని చేవూరు జాతీయ రహదారి పక్కన ఉన్న రామదూత ఆశ్రమంలో పెరుగుతున్న చలి దృష్ట్యా శ్రీ రామదూత స్వామి ఆశ్రమం వారు శ్రీ రామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఆశ్రమం సమీపంలో గ్రామాలలో దుప్పట్లు పంపిణీ చేశారు. చేవూరు, ఏలూరు పాడు, సంగం మరియు శాంతి నగర్ సంగంలలో దాదాపు 900 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహణ బాధ్యులు హనుమంతు రావు చౌదరి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు,మురలి మరియు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. త్వరలో జిల్లాలో ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

## కొడవలూరులో కదంతొక్కిన వైకాపా శ్రేణులు

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :** కోవూరు నియోజక వర్గం, కొడవలూరు మండల కేంద్రంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా.కాకాణి గోవర్ధన్ రెడ్డి. కోవూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వపు కక్ష సాధింపులో భాగంగా సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయడం, విఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులు రేషన్ డీలర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలను తొలగించడాన్ని నిరసిస్తూమండల పరిషత్ కార్యాలయం వరకు సాగిన భారీ ర్యాలీ వెళ్లి మండల అధికారులకు వినతిపత్రం సమర్పించిన తర్వాత ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన కాకాణి, ప్రసన్న వీరి చలపతి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న అక్రమాలు, అధికారుల నిర్వాకాలపై మండిపడ్డ కాకాణి, ప్రసన్న, పోలీసు కేసులకు భయపడమని, ప్రజల సమస్యలపై పోరాడుతామని తెలుగుదేశం ప్రభుత్వాన్ని గద్దెదించిజగనన్నను ముఖ్యమంత్రి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న భారీగాతరలి వచ్చిన ప్రజలు, నాయకులు,కార్యకర్తలు అందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు.

# పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు సమీక్ష సమావేశం

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :** జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఎన్సిడిసిడి మీద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు సమీక్ష సమావేశం స్టేట్ ఎన్సిడి సిడి నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ శ్యామల వారు నిర్వహించారు. వీరు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము సిడిఎన్సిడి 3.0 సర్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఏఎన్ఎం,ఆశ సిహెచ్ఓ ఒక టీం గా ఏర్పడి ప్రతిరోజు తప్పనిసరిగా ఐదు ఇల్లు సర్వే పూర్తి చేయాలని, ఆయా ఇళ్లల్లో 18 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరిని తప్పనిసరిగా పరీక్ష చేయవలెను అని వైద్యాధికారులు ఆదేశించారు. ఎన్సిడి సిడి 3.0 లో క్యాన్సర్ స్క్రీనింగ్, మెంటల్ హెల్త్ ని కొత్తగా యాడ్ చేయటం జరిగిందని, క్యాన్సర్ స్క్రీనింగ్ ని ఇంత భారీ స్థాయిలో దేశంలో చేస్తుంది ఒక్క ఆంధ్రప్రదేశ్ అని, దేశ మొత్తము ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుందని, కావున ఎన్సిడి సిడి సర్వే సంఖ్యాపరంగానే కాకుండా గుణాత్మకంగా కూడా చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు

## ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం

**విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు:** కొండాయ పాళెంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు యం భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి మాట్లాడుతూ బాలికల సాధికారత, విద్య కోసం ఏర్పాటు చేసిందే నేషనల్ గర్ల్ చైల్డ్ డే. దీని ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రతి తల్లిదండ్రులు తెలుసుకోవాలని. వారికి సమాన హక్కులు కల్పించాలని, భారతీయ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడానికి జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటారు. ఆడపిల్ల ఇంట్లో పుడితే ఒకప్పుడు ఆనందించే వారు కాదు, మూతి ముడుచుకుని పక్కకి వెళ్లిపోయారు. చూసేందుకు కూడా ఇష్టపడని సమాజం ఉండేది. ఇప్పుడు కాలం మారుతూ వస్తోంది. ఆడపిల్లలు కూడా చదువుల్లో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. వారు కూడా మగవారితో సమానంగా పనిచేయగలుగు తున్నారు. వారికి కావాల్సిందల్లా కాసింత మద్దతు. ఆ మద్దతును తొలిగా ఇవ్వాల్సింది తల్లిదండ్రులే. కొడుకుతో సమానంగా కూతురుని చదివించి ఉద్యోగానికి పంపించే తల్లిదండ్రులనే ఇప్పుడు ప్రతి ఆడపిల్ల కోరుకుంటుంది. కానీ ఇప్పటికీ ఆడపిల్లల్ని చదివిస్తున్నా ఉద్యోగానికి పంపకుండా పెళ్లి చేసే తల్లిదండ్రులు ఇంకా ఉన్నారు. ఆడపిల్ల కేవలం పెళ్లి కోసమే పుట్టినట్టు భావించకుండా వారి కలలకు రెక్కలివ్వాలన్నారు. కుటుంబానికి బంగారు భవిష్యత్తు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర రావు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా ర్యాలీ

**విశాలాంధ్ర-రాపూరు:** శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బొజ్జనపల్లి పంచాయతీ పరిధిలోని బొజ్జనాపల్లి అంగనవాడి మరియు ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మరియు ఉద్యోగ సిబ్బంది అయి న పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే హజరత్తయ్య, సహోపాధ్యా యులు వరప్రసాద్ గుప్తా అంగన్వా డి టీచర్ ఏ అంకమ్మ ఆయా ఉమా మరియు రమణమ్మ, కమిటీ సభ్యు లు రమాదేవి,గ్రామస్తుల ఆధ్వర్యం లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వ హించి ప్రజలు అవగాహన కల్పించ డం జరిగిందని ప్రధానోపాధ్యాయులు హజరత్తయ్య తెలియజేసారు. భేటీ పచావో-బేటి పడావో నినాదంతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి బాలికని పాఠశాలకు పంపించి చదివించాలని ప్రజలు అవగాహన కల్పించారు. బాలికల విద్య గురించి గొప్పతనం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం జరి గిందని ప్రాధనోపాధ్యాయులు కె.హజరత్తయ్య తెలియజేసారు.

# ఘనంగా బాలికల దినోత్సవం

**విశాలాంధ్ర - మనుబోలు:** మనుబోలు మండలం బద్దెవోలు జిల్లా పరిషత్ హై స్కూల్ లో బాలికల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు బాల్య వివాహాలు వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలు గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణమ్మ వివరించారు. మగ పిల్లలతో దీటుగా ఆడపిల్లలు చదువుకోవాలని సూచించారు. బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం మనోహరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, అంగన్వాడి కార్యకర్తలు: రాధా ఉమామహేశ్వరి, రమణమ్మ, ముత్యాలమ్మ, రమణమ్మ ,కల్పన, దోరసానమ్మ ,హెల్పర్ అచ్చమ్మ, పద్మమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలి

**విశాలాంధ్ర-ముత్తుకూరు:** బాలికలు అన్ని రంగాల్లో ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ ముత్తుకూరు, పంటపాలెం, పిడతా పోలూరు సెక్టార్ల సూపర్వైజర్లు అమ్ము నమ్ము ,సుబ్బమ్మ, మంజుల లు తెలిపారు. శుక్రవారం ఇందుకూరుపేట సెక్టార్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణపట్నం ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు మాట్లాడుతూ కిశోర బాలికలకు విద్య, ఆత్మరక్షణ, పోషకాహారం, టోల్ ఫ్రీ నంబర్ లపై, వ్యక్తిగత పరిశు భ్రత పై, సమాజంలో కిషోర్ బాలికలు ఏ విధంగా ఉండాలి అనే విషయాలపై సమగ్రంగా వారికి వివరించడం జరిగింది. అనంతరం జాతీయ కిశోర బాలిక దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సరళ, ఉపాధ్యాయులు ఎమ్మెస్ కే . మోబినా అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేస్తం ఫౌండేషన్, ఆర్ వై ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**విశాలాంధ్ర-ముత్తుకూరు:** నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్వైఎస్ సహకా రంతో మండల కేం ద్రంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆర్వైఎస్ సహకారంతో శివ టోర్నమెంట్‌ను కూడా వారు ప్రారంభించారు. అలాగే గతంలో జరిగిన టోర్నమెంట్ కు సంబంధించినటువంటి గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం కూడా చేయడం జరిగింది. అలాగే గతంలో కృష్ణపట్నం పోర్టు సీఈవో గా పనిచేసిన అవినాష్ చంద్ర, కోమారి శివలు మరణించడంతో వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. సందర్భంగా ప్రస్తుత అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్, పి ఆర్ హెడ్ వేణుగోపాల్, రాము లు మాట్లాడుతూ గతంలో కృష్ణపట్నం పోర్టు సీఈవోగా పనిచేసిన అవినాష్ చంద్ర కృష్ణపట్నం పోర్టు అభివృద్ధితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల సంక్షేమాన్ని కూడా చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే కోమారి శివ కృష్ణపట్నం పోర్టులో మొబైల్ షాప్ పెట్టుకుని జీవనం గడుపుతూ అనారోగ్యంతో తక్కువ వయసులో మరణించడం జరిగిందని అతనిని కూడా నివాళులర్పించారు. అనంతరం ఐపిఎల్ తరహాలో ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ను వారు ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగు టీంలు ఈ పోటీల్లో పాల్గొంటున్నా యని నిర్వాహకులు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 1503 మంది రక్తాన్ని దానం చేసినట్టు నేస్తం ఫౌండేషన్ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, వెంకన్న లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మనుకూరు రవికుమార్ రెడ్డి, ముత్యం గౌడ్ ,టోర్నమెంట్ నిర్వాహకులు రవి, ఎల్లయ్య ,సుధాకర్ ,ప్రసాద్, విజయ్, మోహన్ రావు ,కళ్యాణ్ ,ఉదయ్ కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదా నీకు ఇష్ట పట్నం పోర్టు ఫౌండేషన్ నిర్వాహకులు రాకేష్ రంజన్ కూడా పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలలో నివసిస్తున్న వారికి రక్షణ కల్పించండి

### సిపిఐ నగర కార్యదర్శి అరిగెలసాయి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: టిడ్కో గృహాలలో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కల్పించాలని సిపిఐ నగర కార్యదర్శి అరిగేల సాయి ప్రకటన ద్వారా తెలియజేశారు. పై సమస్య పైన మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో కొన్ని వేల మంది ప్రజలు టిడ్కో గృహాలలో నివసిస్తున్నారని, అందులో ప్రధానంగా నెల్లూరు రూరల్ పరిధిలోని, అక్కచెరువుపాడు నందుగల టిడ్కో గృహాలలో నిరుపేదలైన ప్రజలు అధికంగా నివసిస్తున్నారు. ఇక్కడ కొంతమంది ఆకతాయిలు, బహిరంగ మద్యపానం, ధూమపానం సేవిస్తూ, ప్రజల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారు. దీని మీదస్థానికులు గతంలో పలుసార్లు పోలీసులకు,ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా ఈ ఆగడాలు ఆగడంలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఇళ్ల ముందు పార్కింగ్ చేసిఉన్న నాలుగు ఆటోలకు బ్యాటరీలు,టైర్లు, వివిధ రకాల స్పేర్ పార్ట్లు దొంగలించడం జరిగింది. దీని మీద స్థానికులను తీసుకుని సిపిఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, నగర నాయకులు షేక్ సోఫియా ఆధ్వర్యంలో ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. స్థానికుల కోరిక మేరకు అక్కడ పోలీస్ గస్తీ ఉండే విధంగా, పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. దొంగతనం చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని ఐదవ పట్టణ పోలీసులు తెలియజేశారు.అయితే ఈ టిడ్కో సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయకపోతే, అక్కడున్న నిరుపేద ప్రజలు ఇంకా అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్కచెరువుపాడులో ఉన్న టిడ్కో గృహ సముదాయం మీద ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ జరుగుతున్న ఆగడాలు, ఆకతాయిలు అనుచితంగా వ్యవహరించడం, లాంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రకటన ద్వారా కోరడం జరిగింది.

## కాకాణితో ఆనం విజయకుమార్ రెడ్డి భేటీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెల్లూరు రూరల్ నియోజకవర్గం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆనం విజయ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించారు.

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర -కావలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ని కలిసి ఇటీవల కాలంలో తాను చేసిన వివిధ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా రెండవ సారి ఎన్నికైన ఐ.సాయి ప్రసాద్ కు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులు ఒత్తిడికి లోను కాకూడదు

విశాలాంధ్ర-ముత్తుకూరు: విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి లోను కాకూడదని అందువల్ల నష్టపోయే ప్రమాదం ఉందని సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఈదురు ఈశ్వరమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్తుకూరు నందు సెట్నెల్ సిఇఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మానసిక వైద్యులు డాక్టర్ సురేష్ బాబు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా ఎలా చదవాలి, ఎలాంటి మానసిక వత్తిడి లేకుండానే ప్రణాళిక బద్ధంగా చదువుతూ అత్యధిక మార్కులు ఎలా సాధించాలో తెలిపారు.ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం ఇదే పాఠశాల లో కాసారం లాస్య లహరి అనే విద్యార్థిని 580 మార్కులు సాధించిందని, అలాగే ఈ సంవత్సరం మీరు కూడా కష్టపడి బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని స్కూలుకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో సెట్ నెల్ మేనేజర్ శ్రీనివాసులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 2న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమం

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఫిబ్రవరి రెండవ తేదీన నిర్వహిస్తున్నట్లు, శ్రీ వెంకట గాయత్రి సేవా ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక లో ప్రెస్ క్లబ్లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ నిర్వాహకులు శేషగిరిరావు మాట్లాడుతూ తమ సంస్థ రజితోత్సవ సందర్భంగా 33వ అఖిల భారత సంస్థ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని స్థానిక పాదుకా మండపం, ఇస్కాన్ మందిరం ఎదురుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక బ్రాహ్మణ కుటుంబీకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పేర్లు నమోదు చేసుకుని పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఇస్లాం పేటలో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర- కావలి : కావలి పట్టణంలోని ఇస్లాంపేటలో డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటింటా తిరుగుతూ అనుమానాస్పద వ్యక్తులను వారి ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులను వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకుంటే స్వాధీనం చేసుకొని కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో డిఎస్పి శ్రీధర్ పాల్గొని పర్యవేక్షించారు. ఈ కార్డెన్ సెర్చ్ లో ఒకటో పట్టణ సిఐ సయ్యద్ ఫయాజ్, ఎస్సైలు, సుమన్, జానకి రామ్ రెడ్డి, అంబేద్కర్ రెండవ పట్టణ సీఐ గిరిబాబు, ఎస్సైలు , రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సైలు తిరుమల రెడ్డి, బాజీ బాబు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని ఇస్లామాపేటలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా ఉన్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటో ను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేవిధంగా లా అండ్ ఆర్డర్ పై ప్రజలకు అవగాహన చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీధర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ చేయటం జరిగిందన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం నాలుగు గంటల నుంచి ఇస్లామాపేటలోని ప్రతి ఇంటిని సర్చ్ చేయటం జరిగిందన్నారు. ఈ తనిఖీలో భాగంగా ఏలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 37 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజలందరూ కూడా బైకులు కొనేటప్పుడు ఆర్ సి ని చూసుకుని కొనుక్కోవాలని సూచించారు. ఏలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని బండ్లను కొన్నట్లయితే పురోక్షంగా దొంగలకు సహకరించిన వారమవుత మన్నారు. ఈ క్రమంలో ఎవరైనా దొంగ బండ్లు అమ్మేవారు మీ దృష్టికి వచ్చినట్లయితే పోలీస్ అధికారు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర -కావలి: కావలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో అశ్వర్థ నారాయణ కళ్యాణం మరియు జంట నాగుల శిలా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నాగుల శిలా ప్రతిష్టకు విచ్చేసిన ఎమ్మెల్యే కు స్థానికులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. దేవుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. త్వరలో రూ.1 కోటి 70 లక్షలతో ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు వేయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, ఉప్పుటూరి బాలగురు స్వామి, ద్రోనాదుల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

### వలేటివారిపాలెం, పోకూరులో

## నూతన భవనాలకు ప్రతిపాదనలు: ఏడిఏ

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగించుకోవాలని ఏడిఏ డాక్టర్ కె.వి బ్రహ్మయ్య అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం ను విజయవంతం చేయడానికి వ లేటివారిపాలెం, లింగసముద్రం మండలంలలో ఒక్కొక్క మండలానికి రెండు టీములు చొప్పున ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వలేటివారి పాలెం, పోకూరులలో నూతన భవనాల నిర్మాణాలు కొరకు ప్రతి పాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించామని ఆయన చెప్పారు. భవనాలకు నిధులు మంజూరు ఆయన వెంటనే నిర్మాణ పనులకు శ్రీకారం చేపడతామని వివరించారు.

# నందవరం దర్గాలో గంధోత్సవం

విశాలాంధ్ర - మర్రిపాడు: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసి ఉన్న శ్రీశ్రీశ్రీ హజరత్ నజర్అలెం షహీద్ స్వామి వారి గంధోత్సవమును దర్గా కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ గ్రంథ ఉత్సవంలో ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గంధోత్సవం అనంతరము భక్తులకు బీడాను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

విశాలాంధ్ర- నెల్లూరు సిటీ: డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ ( క్రీడల) కార్యక్రమంలో ఆ స్కూలు విద్యార్థులు పోటా పోటీగా పాల్గొన్నారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ క్రీడలు నిర్వహించారు. పరుగు పందెం, లాంగ్ జంప్, తదితర క్రీడలను సంస్థ యాజమాన్యం విద్యార్థులకు నిర్వహించారు. ఆ సంస్థ నిర్వాహకులు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో క్రీడలను వైభవంగా నిర్వహించారు. ఆ క్రీడలను ఆ విద్య సంస్థ బ్రాంచిల ప్రిన్సిపాల్ లు పర్యవేక్షించి విజేతలను నిర్ణయించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ విద్యాసంస్థల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చొరవతో కదిలిన ఇరిగేషన్ యంత్రాంగం

విశాలాంధ్ర -కొండా పురం: రైతన్నల పక్షపాతిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలో వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలి అన్న దృఢ సంకల్పంతో రైతుల కష్టం చెపితే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. ఇదే క్రమంలో నియోజకవర్గంలోని సత్యవోలు నుండి కొమ్మి చెరువుకు వెళ్లే కాలువ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై జంగల్, పూడికతో నిండి పోయిందని దీంతో చెరువుకు నీరు రాక 11 వందల ఎకరాలు బీడు భూమిగా మిగిలిపోయిందని కొండాపురం మండలం కొమ్మి చెరువు నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి సురేష్ గ్రామస్తులు తెలియజేశారు. వెంటనే స్పందించిన కాకర్ల సురేష్ ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన కాలువ పూడిక తీత పనులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. వెంటనే కదిలిన ఇరిగేషన్ శాఖ యంత్రాంగం జెసిబి ల సహాయంతో రాత్రి పగళ్ళు పనిచేయించి కాలువ పూడిక తీత పనులు పూర్తి చేశారు. సోమశిల ఉత్తర కాలువ ద్వారా వస్తున్న సోమశిల జలాలు కుడుములదిన్నేపాడు వద్ద కటింగ్ పాయింట్ నుండి సత్తివోలుకు వస్తాయి. అక్కడనుండి 2.6 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తి కావడంతో గలగల పెన్నమ్మ పరుగులు తీసి కొమ్మి చెరువు వడిలోకి చేరింది. దీంతో చెరువు జలకళ సంతరించుకొని నిండుకుండలా మారింది. రైతన్నల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 1100 ఎకరాల భూమి సాగులోనికి వచ్చింది. పచ్చదనంతో భూదేవి పురుడుపోసుకుంది. ఎమ్మెల్యే కృషితో రైతన్నల కష్టం తీరింది. రైతు బిడ్డగా రైతన్న ఇంట నిలిచిన ఎమ్మెల్యేకాకర్ల సురేష్ కి రైతన్నల తరఫున సాగు నీటి సంఘం అధ్యక్షులు మరియు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.